



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 114 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 6 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 114 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 6 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే..
# పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

- వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో 30 ఏళ్లు పూర్తి
- నాడు ప్రకాశం ప్రజల కష్టాలు చూడలేకే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టానన్న సీఎం
- ఈ ఏడాది జులై నాటికి తొలి దశ పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తాం
- 2027-28 నాటికి వెలిగొండ ఫేజ్-2 పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో (మార్చి 5) సరిగ్గా 30 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే" అని ఆయన స్పష్టమైన ప్రకటన చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని, భవిష్యత్ కార్యాచరణను ఆయన ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5వ తేదీ తనకు ఇంకా స్పష్టంగా గుర్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆనాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్ర కరవు కాటకాలతో, కనీసం తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రజల కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు తొలి అడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని మళ్లించి... ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే బృహత్తర లక్ష్యంతో నాడు వెలిగొండకు భూమిపూజ చేశామని తెలిపారు.అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి 2014-19 మధ్య తమ ప్రభుత్వ హయాంలో రూ.1,414 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశామన్నారు. కానీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలైందని విమర్శించారు.
2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. గతంలో పెండింగ్ ఉన్న రూ.140 కోట్ల బిల్లులను వెంటనే క్లియర్ చేశామని, ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటివరకు రూ.585 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్

- మిగతా2లో



## ముగిసిన నితీశ్ శకం..

### బీహార్ తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఎవరెవరు ఉన్నారంటే..?

- రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్
- బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!
- సీఎం రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానంద రాయ్, దిలీప్ జైశ్వాల్

పెన్ పవర్ డెస్క్:బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమా ర్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయ డం

- మిగతా2లో



## సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

- రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వేం నరేందర్ రెడ్డి
- నామినేషన్ వేయడానికి ముందు పదవికి రాజీనామా
- నామినేషన్ కార్యక్రమానికి హాజరైన రేవంత్ రెడ్డి


- మిగతా2లో

## ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- కుటుంబ నియంత్రణ నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ వైపు ఏపీ అడుగులు
- 2047 నాటికి రాష్ట్ర జనాభాలో 23 శాతం వృద్ధులే ఉండే ప్రమాదం
- పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ద్వారా ప్రభుత్వమే సాయం చేస్తుంది
- ముసాయిదా పాలసీపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత కీలకమైన 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో కీలక ప్రకటన చేశారు. దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఫ్యామిలీ ప్లానింగ్' విధానం నుంచి ఇకపై 'పాపులేషన్ కేర్' వైపు దృష్టి సారించాల్సిన

- మిగతా2లో



## సునీల్ నాయక్ ను 7 గంటల పాటు విచారించిన అధికారులు

- హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్
- అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం
- ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్న విచారణ



పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'కస్టడీ చిత్రహింసల' కేసులో ఐపీఎస్ అధికారి

- మిగతా2లో



## జగన్ జీతం తీసుకోవడం లేదు


- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు.

- మిగతా2లో

## ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితకు అస్వస్థత
- అసెంబ్లీ సమావేశాల సమయంలో నలతగా ఉండటంతో ఆసుపత్రికి తరలింపు
- గత వారం రోజులుగా తీరికలేని షెడ్యూలే కారణమని సమాచారం
- ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపిన వ్యక్తిగత సిబ్బంది



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. నేడు అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆమెకు స్వల్పంగా నలతగా అనిపించడంతో, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనితకు రక్తపోటు (బీపీ) పెరిగినట్టు వైద్యులు తెలిపారు. ఉదయం నుంచి అనిత శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రధానంగా తిరుమల లడ్డూ వ్యవహారంపై జరిగిన చర్చల్లో కూడా ఆమె భాగమయ్యారు. మండలి సమావేశాలు వాయిదా పడిన తర్వాత, అసెంబ్లీ కొనసాగుతున్న సమయంలో ఆమె అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు.గత వారం రోజులుగా అసెంబ్లీ సమావేశాలు,

- మిగతా2లో

## జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది

- ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా గందరగోళం
- చైర్మన్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేసిన వైసీపీ సభ్యులు
- సభను వాయిదా వేసిన మండలి చైర్మన్

- మిగతా2లో



# ఒక యుద్ధం.. 14 దేశాలు ఆగం



- మండుతున్న పర్షియన్ గల్ఫ్
- అమెరికా బేస్ క్యాంపులే లక్ష్యం
- ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు
- అజార్ బైజన్ ఎయిర్ పోర్టుపై దాడి
- అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్
- దాడి అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్

పెన్ పవర్ డెస్క్: ఇరాన్,-ఇజ్రాయిల్- అమెరికా యుద్ధం విస్తరిస్తోంది. పర్షియన్ గల్ఫ్ లో ని యెమన్ మినహా అన్ని దేశాల్లో ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, టర్కీ, ఇరాక్, ఒమన్, అజార్ బైజాన్ పై ముమ్మరంగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడులు చేస్తోంది. ప్రత్యేక ప్రాంతంగా గుర్తించిన సక్సివాన్ పైనా ఇవాళ దాడులు జరిగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ వి మానాశ్రయం దగ్గర ఉన్న అమెరికా సైనిక స్థావరంపైనా దాడి జరిగింది. ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం, దేశంలోని వాయు రక్షణ వ్యవస్థలు ఒక మిస్సైల్ దాడిని అడ్డుకున్నాయి. దోహా పై ఆకాశంలో అనేక పేలుళ్లు జరిగాయి. సౌదీ అరేబియా రక్షణ శాఖ వివరాల ప్రకారం.. ఒక డ్రోన్ దాడికి ఇరాన్ యత్నించగా.. అల్ జెఫ్ ప్రాంతం దగ్గరధ్వంసమైంది. టర్కీ గగన తలంలోకి వచ్చిన బాలిస్టిక్ మిస్సైల్ ను నాటో దళాలు నిర్వీర్యం చేశాయి. దీనిపై ఇరాన్ సైన్యం స్పందించింది. తాము టర్కీ భూభాగాన్ని టార్గెట్ చేయలేదని స్పష్టం చేసింది. ఒమన్ లోని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీకి

- మిగతా2లో



## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
- ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
- వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
- విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

2లో



## అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

- ఆరు రోజులుగా ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ మధ్య భీకర యుద్ధం
- ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందన్న ఇజ్రాయెల్
- పాలనను మార్చాలని చూస్తే అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరిక

2లో

## ఎడిటర్ వ్యూ

# హోర్ముజ్ మూసివేతతో ప్రపంచం కుదేలైందా?

హోర్ముజ్ సముద్ర మార్గం (జల సంధి) ప్రపంచంలో అతి ముఖ్యమైన జలమార్గాల్లో ఒకటి. ఇరాన్ ఉత్తర భాగంలో, ఒమన్ దక్షిణ భాగంలో ఉంది. పర్షియా గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఇరుకైన మార్గం.అత్యంత ఇరుకైన చోట కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇది ఒక చిన్న మార్గం కావడం వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 'గొంతు' లాంటిది. ఏ చిన్న అడ్డంకి వచ్చినా ప్రపంచ చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి.. ఇప్పుడు జరుగుతున్న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత మార్చి 2న ఈ మార్గం మూసివేస్తున్నామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఏ ఓడ ఈ మార్గం నుండి వెళ్లినా దాడి చేస్తామని హెచ్చరించింది. ఫలితం.. వాణిజ్య ఓడలు ఆగిపోయాయి. పెద్ద షిప్పింగ్ కంపెనీలు రవాణా ఆపేశాయి. ట్యాంకర్లు దాదాపు జీరోకి తగ్గాయి. కొన్ని ట్యాంకర్లపై దాడులు జరిగి 5కి పైగా ఓడలు దెబ్బ తిన్నాయి. 150కి పైగా ఓడలు ఆగిపోయాయి. హోర్మోజ్ జల సంధి వాస్తవంగా మూసివేయబడింది. ప్రతి రోజూ సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, ఇతర ఇంధనాలు ఈ మార్గం గుండా ప్రపంచానికి వెళ్తాయి. ఇది ప్రపంచ మొత్తం చమురు వినియోగంలో సుమారు 20 శాతానికి సమానం. సముద్ర మార్గంలో వచ్చే చమురులో 25-30 శాతం ఇక్కడి నుంచే వస్తుంది. ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో కూడా సుమారు 20 శాతం ఈ మార్గం గుండా వెళుతుంది. గల్ఫ్ దేశాలు - సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఇరాన్ - వీటి చమురు ఎగుమతులు దాదాపు అన్నీ ఇక్కడి గుండానే వెళ్తాయి. ఆసియా దేశాలు ఎక్కువగా ఈ మార్గంపై ఆధారపడతాయి. చైనా అత్యధికం, ఆ తర్వాత భారత్, జపాన్, దక్షిణ కొరియా. ఈ మార్గం ద్వారా వెళ్లే చమురులో 84 శాతం ఆసియాకు వెళ్తుంది. ఇరాన్ ఉత్తర భాగాన్ని నియంత్రిస్తుంది కాబట్టి దాడి చేసి లేదా హెచ్చరించి మార్గాన్ని నియంత్రించగలదు. ఇది ఇరాన్‌కు పెద్ద వ్యూహాత్మక ఆయుధం. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి హెచ్చరికలు చేసింది. కానీ ఈసారి అమలు చేసింది. దీని వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ తగులుతోంది. చమురు ధరలు ఇప్పటికే 7 నుంచి 13 శాతం పెరిగాయి. ఏ100కి చేరే అవకాశం ఉంది.

మన దేశం 85-90 శాతం చమురు విదేశాల నుంచి తీసుకుంటుంది. అందులో సగం కంటే ఎక్కువ (సుమారు 50 శాతం) ఈ మార్గం గుండా వస్తుంది. రోజుకు 1.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెల్స్. ఇరాక్, సౌదీ అరేబియా, యుఏఈ, కువైట్ నుంచి వచ్చే నూనె దాదాపు అన్నీ ఇక్కడి గుండానే.. దీంతో పాటు వంట గ్యాస్ (ఎల్‌పీజీ)లో 85 శాతం, ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో 55 శాతం ఈ మార్గం గుండా వస్తాయి.. ఈ మార్గం మూసివేత కొనసాగితే మన చమురు స్టాక్ కేవలం 40-45 రోజులకు సరిపోతుంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన ఖర్చు ఎక్కువవుతుంది. రూపాయి విలువ తగ్గుతుంది. వాణిజ్య లోటు పెరుగు తుంది. ఇది కేవలం చమురు సమస్యే కాదు. ఎగుమతులు ఆలస్యమవుతాయి. షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. గల్ఫ్‌లో పని చేసే 90 లక్షల మంది మనవాళ్ల భద్రత, సంపాదన ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడి పడుతుంది.

ఇరాన్‌కు ఇది ఏకైక ఆయుధం. అణు శక్తి, సైనిక బలం తక్కువైనా ఈ మార్గంతో ప్రపంచాన్ని బెదిరించగలదు. అమెరికా నావల్ ఫోర్సెస్ ట్యాంకర్లను రక్షించడానికి సిద్ధమవుతున్నాయి కానీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి చోక్‌పాయింట్లు (ఇరుకైన మార్గాలు) ఎంత బలహీనమైన దేశానికైనా పెద్ద శక్తిని ఇస్తాయని ఇది నిరూపిస్తోంది. అందుకే భారత్ తక్షణం రష్యా నుంచి చమురు ఎక్కువ దిగుమతి చేసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. మన వ్యూహాత్మక చమురు నిల్వలను (రాఖఖీ) ఉపయోగించాలి. దీర్ఘకాలంలో చమురు దిగుమతులను వైవిధ్య పరచాలి. సౌర శక్తి, గాలి శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.. ఇరాన్ యుద్ధం మనకు ఒక పెద్ద హెచ్చరిక - ఎనర్జీ భద్రతను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలి. హోర్ముజ్ సముద్ర మార్గం మూసివేత ప్రపంచానికి పెద్ద సంక్షోభం తెచ్చింది. భారత్ వంటి దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ఇరాన్ యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఐక్య రాజ్యసమితి ద్వారా తక్షణం సంభాషణలు జరిపి యుద్ధాన్ని ఆపాలి. ఈ మార్గం తెరవాలి. యుద్ధం కొనసాగితే ప్రపంచమంతా నష్టపోతుంది. శాంతి, సంభాషణలు, దౌత్యం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించాలి. భారత్ ఈ విషయంలో నాయకత్వం వహించాలి!

# జగన్ జీతం తీసుకోవడం లేదు

- మొదటి పేజి తరువాయి
సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు.కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు.

ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో

రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

## సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభ రేసులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఆయన పేరును ఖరారు చేయడంతో, సాంకేతిక కారణాల దృష్ట్యా ఆయన తన ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి 'లాభదాయక పదవుల్లో' ఉండకూడదనే నిబంధన ఉండటంతో, నామినేషన్ దాఖలుకు ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వేం నరేందర్‌రెడ్డి రాజీనామాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదించారు.

రాజీనామా ప్రక్రియ ముగిసిన వెంటనే, వేం నరేందర్‌రెడ్డి మరో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో కలిసి అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఆయన వెంట ఉన్నారు. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ ఈ ఇద్దరినీ బరిలోకి దింపింది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఈ రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకునే అవకాశం ఉంది.

## జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల లడ్డూ కల్తీ అంశంపై ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ సున్నితమైన అంశంపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వం తరఫున ప్రకటన చేసేందుకు సిద్ధమవగా, ప్రతిపక్ష వైసీపీ సభ్యులు తీవ్రస్థాయిలో అడ్డు తగిలారు.

తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందనే విషయం దర్యాప్తు సంస్థల నివేదికల్లో స్పష్టంగా ఉందని, అప్పటి ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి తమకు అనుకూలమైన వారికి టెండర్లు కట్టబెట్టిందని మంత్రి ఆనం ఆరోపించారు. జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగిందని, నాటి టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి కూడా కొన్ని విషయాలను అంగీకరించారని ఆయన గుర్తు చేశారు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు.

మంత్రి మాట్లాడుతున్న సమయంలోనే వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను

చుట్టుముట్టి నినాదాలు చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం పెరగడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మండలి చైర్మన్ మోషేను రాజు సభ్యులను శాంతింపజేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో, చివరకు సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

### కొత్త శకంలో భారత్-యూరప్ బంధం

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కీలక ఒప్పందాలపై సంతకాలు

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

## వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే..

# పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

- మొదటి పేజి తరువాయి
పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.

రైతుల కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ ఏడాది (2026) జులై నాటికి వెలిగొండ తొలి దశ (ఫేజ్-1) పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు.

కరవు ప్రాంతంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చి, హార్టికల్చర్ సాగును ప్రోత్సహించి రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ముగిసిన నితీశ్ శకం..

- మొదటి పేజి తరువాయి
ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...? సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్. నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా,

ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

## ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత

- మొదటి పేజి తరువాయి
వరుస కార్యక్రమాలతో హోంమంత్రి తీరిక లేకుండా గడుపుతున్నారు. నిరంతర పని ఒత్తిడి, సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఆమె నీరసించిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.హోంమంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వ్యక్తిగత సిబ్బంది స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించినట్లు సమాచారం. అంతా సవ్యంగా ఉంటే ఈ రోజు సాయంత్రానికే ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

### ఒక యుద్ధం.. 14 దేశాలు ఆగం

- మొదటి పేజి తరువాయి
చెందిన ఒక స్టోరేజ్ ట్యాంక్వచ్చిన బాలిస్టిక్ మిస్సైల్ ను నాటో దళాలు నిర్వీర్యం చేశాయి. దీనిపై ఇరాన్ సైన్యం స్పందించింది. తాము టర్కీ భూభాగాన్ని టార్గెట్ చేయలేదని నాశనం చేసింది. ఒమన్ లోని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీకి చెందిన ఒక స్టోరేజ్ ట్యాంక్ తెలిపింది. తుర్కీ అధ్యక్షుడు రెసెప్ తాయిప్ ఎర్డోగాన్ మాట్లాడుతూ "అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నాటో మద్దతు తీసుకుంటు న్నట్లు తెలిపారు. అటు ఇరాన్ కు మద్దతుగా లెబనాన్ సైతం దాడులకు దిగుతోంది. హిజ్బు ల్లా సంస్థ కూడా ఇరాన్ కు మద్దతు పలికింది.

### సునీల్ నాయక్ ను 7 గంటల పాటు

## విచారించిన అధికారులు

- మొదటి పేజి తరువాయి
సునీల్ నాయక్ తొలిరోజు విచారణ ముగిసింది. ఈరోజు ఉదయం ప్రారంభమైన ఈ విచారణ, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్, అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది.రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో ఉంచిన ఆ రాత్రి, సునీల్ నాయక్ పలుమార్లు ఆ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. దీనిపై అధికారులు ప్రశ్నించగా, ఆయన కేవలం అరకొర సమాధానాలతోనే సరిపెట్టినట్లు సమాచారం. సీఐడీ కార్యాలయంలో ఆ రాత్రి జరిగిన పరిణామాలు, ఎవరి ఆదేశాల మేరకు ఆయన అక్కడికి వెళ్లారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఈ విచారణ కొనసాగాల్సి ఉంది. అంటే, మరో నాలుగు రోజుల పాటు ఆయన పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. రాబోయే నాలుగు రోజుల్లో ఆయన ఎలాంటి వాంగ్మూలం ఇస్తారో, ఈ కేసులో ఇంకెవరి పేర్లు బయటకు వస్తాయో వేచి చూడాలి.

### అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య గత ఆరు రోజులుగా భీకర యుద్ధం సాగుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో మృతి చెందారు. ఖమేనీ మృతి చెందిన తర్వాత యుద్ధం మరింత ఉధృతంగా మారింది.ఇజ్రాయెల్, అమెరికా తమ లక్ష్యాలను చేరుకున్నాయని, ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడైనా యుద్ధాన్ని ఆపివేయవచ్చని వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఇజ్రాయెల్ అధికారి ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాలకులను మార్చుతామంటూ ఇజ్రాయెల్ చేసిన ప్రకటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది.తమ దేశంలో పాలనను మార్చే ప్రయత్నం చేస్తే ఇజ్రాయెల్‌లోని అణు ప్లాంటును లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాకుండా పశ్చిమాసియాలో చమురు మౌలిక సదుపాయాలను తమ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని పేర్కొంది.

### ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- మొదటి పేజి తరువాయి
ఆవశ్యకత ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సిద్ధం చేసిన ముసాయిదా పాలసీని సభలో ప్రవేశపెట్టారు.రాష్ట్రంలో జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) ఆందోళనకరంగా పడిపోతోందని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 1993లో 3.0గా ఉన్న ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5కు పడిపోయిందని తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాల్లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులే ఇప్పుడు ఏపీలోనూ కనిపిస్తున్నాయన్నారు. జననాల రేటు ఇలాగే వేగంగా తగ్గిపోతే భవిష్యత్తులో పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్నవారికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కదేమో అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు జోక్యం చేసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2047 నాటికి మన జనాభాలో 23 శాతం మంది వృద్ధులే ఉంటారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం 'ఐదు అంచెల లైఫ్ సైకిల్' విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు వెల్లడించారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని అనే ఐదు పిల్లర్ల ద్వారా మహిళ గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగా ఉందని, దీనిని 59 శాతానికి పెంచగలిగితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతానికి చేరుతుందని అంచనా వేశారు. సంతానోత్పత్తి సమస్యలతో బాధపడే దంపతులను ఆదుకునేందుకు 'మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో తక్కువ ఖర్చుతో లేదా సబ్సిడీపై ఐవీఎఫ్ సేవలు అందించే ఆలోచనలో ఉన్నామన్నారు. అలాగే అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం, ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజ్ గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తీసుకురావడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ ముసాయిదా పాలసీని ప్రజల ముందు ఉంచుతున్నామని, దీనిపై రాబోయే నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీనికి తుది రూపం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ప్రభుత్వం వైఫల్యం వల్లే కల్తీ పాలు ఘటన లో 9 మంది మృతి

- **కల్తీ పాలు బాధితులకు రూ. 20 లక్షలు చెల్లించాలి**
- **వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 5 :**ప్రభుత్వం వైఫల్యం వల్లే కల్తీ పాలు సంఘటన చోటుచేసుకుందని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ ఆరోపించారు. గురువారం స్థానిక రామాలయం సెంటర్ లో కల్తీ పాలు తాగి 9 మంది మృతి చెందిన సంఘటన పై పార్టీ శ్రేణులతో కలసి మానవహారం గా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులు గడిచినప్పటికీ

ఇవి ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. కల్తీ పాలు సంఘటనలో 9 మంది మృతి చెందినప్పటికీ ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల కేంద్రాలను తనిఖీలు చేయడం లేదని, ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. . వేట్లపాలెం లో మృతి చెందిన బాధితులకు



రూ 20 లక్షల ప్రకటించిన ప్రభుత్వం, రాజమండ్రిలో పాల కల్తీ పాలు త్రాగి మృతి చెందిన బాధితులకు రూ 10 లక్షల ప్రకటించడమేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జీలు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# అగ్నివీర్ నియామకాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- **ఈనెల 13 నుండి ఏప్రియల్ 1వరకు ఆన్‌లైన్ నమోదు**
- **జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5 :**విశాఖ పట్నం లో భారత్ మిలటరీ ఆధ్వర్యంలోని ఆర్మీ నియామక అధికారి కార్యాలయం ద్వారా అగ్నిపథ్ పథకం కింద రిక్రూటింగ్ ఇయర్2027 కు సంబంధించిన అగ్నివీర్ నియామకాల కోసం వివాహం కాని పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

ఈ నియామక ప్రక్రియలో తూర్పు గోదావరి జిల్లా కు చెందిన అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియ చేశారు.

ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అగ్నివీర్ (జనరల్ డ్యూటీ),
అగ్నివీర్ (టెక్నికల్),
అగ్నివీర్ (క్లర్క్ , స్టోర్ కీపర్ టెక్నికల్),
అగ్నివీర్ (ట్రేడ్స్‌మన్ 10వ తరగతి ఉత్తీర్ణులు),అగ్నివీర్ (ట్రేడ్స్‌మన్ 8వ తరగతి ఉత్తీర్ణులు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ లో 13-02-2026 నుండి 01-04-2026 వరకు కొనసాగుతుందనీ , అభ్యర్థులు తప్పనిసరిగా జాయిన్ ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయావలసి ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ కు అర్హులని తెలియ చేశారు.నియామక ప్రక్రియ లో భాగంగా:


దశ × లో ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు (తాత్కాలికంగా రూపొందించిన షెడ్యూల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. దశ ×× లో దశ×లో అర్హత సాధించిన ) అభ్యర్థులు నిర్ణీత తేదీ సమయానికి సంబంధిత నియామక వివరాలు అనుసరించి నిర్దేశిత ప్రాంగణానికి హాజరు కావలసి ఉందన్నారు. ర్యాలీకి సంబంధించిన పూర్తి వివరాలు ప్రత్యేకంగా విడుదలయ్యే ర్యాలీ నోటిఫికేషన్‌లో తెలియజేయనున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో జిల్లాలో యువతకు విస్తృతంగా సమాచారం చేరేలా ప్రచారం నిర్వహించి పెద్ద ఎత్తున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయవలసిందిగా అధికారులను కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.

డైరెక్టర్ రిక్రూటింగ్ కర్నల్ ఆర్.కే. సింగ్ వివరాలు తెలియ చేస్తూ, మూడోవ దశలో ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జజుజు)లో అర్హత సాధించి షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు, సూచించిన తేదీ మరియు సమయానికి నిర్దేశిత నియామక ర్యాలీ వేదిక వద్ద హాజరు కావలసి ఉంటుందన్నారు. ర్యాలీకి సంబంధించిన పూర్తి వివరాలు ర్యాలీ తదుపరి నోటిఫికేషన్‌లో తెలియ చేయడం జరుగుతుందని తెలియ చేశారు. అర్హత గల అభ్యర్థులకు ఈ సమాచారం విస్తృతంగా చేరేలా తగిన ప్రచారం నిర్వహించ వలసిందిగా డైరెక్టర్ రిక్రూటింగ్ కర్నల్ ఆర్.కే. సింగ్ తెలియజేశారు.



## అభివృద్ధి కార్యక్రమాలపై.. ఎత్తిపోతల పథకం రైతులకు నష్టపరిహారం కోసం సీఎం కు వినతి పత్రం అందజేత





**సీతానగరం, పెన్ పవర్, మార్చి 05:**రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి గురువారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాలయంలో సీఎంవో కార్యాలయం నందు గౌరవపూర్వకంగా కలిసి రాజానగరం నియో జకవర్గం పలు అభివృద్ధి కార్యక్రమాలపై మరియు పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం రైతులకు నష్టపరిహారం కోసం సమీక్షించి వినతి పత్రాలు అందజేశారు.పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం కోసం రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు భూములు ఇచ్చారని వారిలో 92 మంది రైతులకు న్యాయమైన పరిహారం మాత్రం అందలేదని వారు ఆందోళన చెందుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు.పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కారణంగా ఈ రైతులు తమ భూములను కోల్పోయారు, ఇప్పటికీ సరైన పరిహారం అందక న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. నాగంపల్లి, వంగలపూడి మరియు పురుషోత్తపట్నంలోని 321 మంది రైతుల నుండి మొత్తం 203.6925 ఎకరాల భూమిని సేకరించారని వారిలో 92 మంది రైతులకు పరిహారం ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. ప్రభుత్వం తమకు నిర్ణయించిన పరిహారం మార్కెట్ ధర కంటే చాలా తక్కువగా ఉందని చాలా మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. చిన్న మరియు సన్నకారు రైతులుగా, తమ భూములను కోల్పోవడం వల్ల కలిగే ఆర్థిక భారం చాలా తీవ్రంగా ఉందని, దీని వలన వారు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారని తెలిపారు. మొత్తం మీద, 92 మంది రైతుల నుంచి సేకరించిన 75 ఎకరాల భూమికి పరిహారం అందలేదని తెలిపారు.ఈ పరిస్థితుల దృష్ట్యా, ఈ విషయాన్ని సమీక్షించి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని బొడ్డు వెంకట రమణ చౌదరి కోరారు. నియోజకవర్గంలో కొన్ని ముఖ్యమైన రోడ్లు పటిష్టపరచాలని, అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నరాని కీలకమైన రోడ్లన్నీ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి గారి దృష్టికి ఆయన తెచ్చారు. వివిధ కారణాల వలన కొన్ని సీఎంఆర్ఎఫ్ ధరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని సదరు లబ్దిదారులు చాలా పేదవారని వారికి మానవతాద్రుక్పదంతో ఆర్థిక సహాయం చేయాలని కోరారు.పై విషయాలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు పై సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓబులు లేని కృష్ణ చైతన్య, గుర్రం ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులిని బంధించండి బాబోయ్





**గంగవరం, పెన్ పవర్, మార్చి 5:**గత పది రోజులుగా పోలవరం జిల్లాలో విస్తృతంగా సంచరిస్తూ ప్రజలకు అటవీ శాఖ సిబ్బందికి కంటిమీద కొనుకు లేకుండా చేస్తున్న పెద్దపులిని వెంటనే బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని జిల్లా ప్రజలు కోరుచున్నారు. మండలంలోని వేము లోవ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి గురువారానికి మండల సరిహద్దులో గల పులికొండ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. దీంతో మండలంలోని మొల్లేరు వడ్డీ చెరువు రాములుదేవపురం గోకవరం మండలం మల్లవరం భూపతి పాలెం పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారు. అడ్డతీగల సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది పెద్దపులి సంచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమీప గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయట తిరగవద్దని పశువులను సురక్షిత ప్రదేశాల్లో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది గ్రామాల్లో మైకులు ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెద్దపులిని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరుచున్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గూడెం అభివృద్ధికి నిధులు ఇవ్వండి...

**శాసనసభలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 05.**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభలో గురువారం పురపాలక శాఖకు సంబంధించి జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో పురపాలక శాఖలో భారీ అవినీతి,దోపిడీ జరిగిందని సభ దృష్టికి తీసుకువచ్చారు. చెత్త సేకరణకు వినియోగించే క్లాప్ ఆటోలు 35 ఆటోలకు రూ.12 కోట్ల 39 లక్షలు చెల్లించారని,వాటి ఖరీదు రూ.85 లక్షల 50 వేలని వివరించారు.ఈ స్కాం వల్ల పారిశుధ్య నిర్వహణ సవ్యంగా జరగ లేదని అన్నారు. సొంతంగా ఆటోలు కొనుక్కునే వెసులుబాటు కల్పించాలని కోరారు. గతంలో తాము ప్రారంభించిన స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, పార్కుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను వైసిపి హయాంలో గత అయిదేళ్లలో పాడుపెట్టారని అన్నారు. ఇప్పుడు మళ్ళీ తాను ఎమ్మెల్యే అయ్యాక వాటిని ప్రజా విరాళాలతో పూర్తిచేశామని తెలిపారు. పట్టణ ప్రజలకు రక్షిత మంచి నీరు అందించడంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు.30 వేల జనాభా ఉన్నప్పుడు నిర్మించిన ఈ రక్షిత మంచినీటి పథకం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం లక్ష 30 వేల మంది పట్టణ జనాభాకు నీరు అందించాలంటే రూ. 4కోట్ల 90లక్షల నిధులతో 11ఎమ్. ఎల్. టి. ట్యాంకు,ఎస్.ఎస్. ట్యాంక్ లను నిర్మించాలని అన్నారు. 2014-19లో అమృత్ -2పధకంలో ప్రతిపాదనలు ఇచ్చామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా ప్రస్తుత మంత్రి నారాయణ సహకారంతోఎస్. ఎస్. ట్యాంక్ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం సి. ఎఫ్. ఎం. ఎస్.అనే ఎకౌంటు ఏర్పాటు చేసి పురపాలక నిధులు మళ్ళించిందని, ఒక రోడ్డు గాని, డ్రైనేజీ గాని నిర్మించలేని పరిస్థితి కల్పించారని అన్నారు. ఇప్పటికైనా పాత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, కొత్త పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రూ.18 కోట్లు వడ్డీలకు తెచ్చి చిన్న చిన్న కాంట్రాక్టర్లు పనులు చేశారని, వారి బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.



# జన్-సంవాద్ కార్యక్రమాలతో అవగాహన మార్చి 24 వరకు వివిధ కార్యక్రమాలు



ఎంపీడీవో లక్ష్మణరావు



**గంగవరం, పెన్ పవర్, మార్చి 5:**గ్రామీణ అభివృద్ధి శాఖ మార్గదర్శకాల ప్రకారం వి.బి.జి.రామ్-జి-2025 కార్యక్రమం ఉద్దేశాలు, లక్ష్యాలు, విశిష్టతలను ప్రజలకు అర్థమయ్యేలా చేయడానికి 'జన్-సంవాద్' పేరుతో ఈ నెల 24వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వై. లక్ష్మణరావు తెలిపారు.గురువారం ఉదయం గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామ పంచాయితీలలో ఉపాధి వేతనదారులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నారు. 9వ తేదీన గ్రామాల్లో వి.బి.జి.రామ్-జి పై ఉన్న అపోహలపై చర్చలు జరపనున్నారు. 10వ తేదీన గ్రామ స్థాయిలో ర్యాలీలు నిర్వహించనున్నారు. 17వ తేదీన మండల స్థాయిలో ప్రజాప్రతినిధులకు వి.బి.జి.రామ్-జి పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే 24వ తేదీన మండల స్థాయిలో 100 రోజులు పూర్తి చేసిన ఎంపిక చేసిన వేతనదారులను సన్మానించనున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీవో ఎం.కె.యస్. ప్రకాష్, జేఈ పద్మనాభం, టి.ఏలు, బి.పి.టి.లు, సి.ఓలు, యప్.ఏలు పాల్గొన్నారు.

# జిల్లాలో 8 న టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడలలో శాప్ లీగ్స్ పోటీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5 :**రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్, చైర్మన్ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో రెండు క్రీడా విభాగాలలో "శాప్ లీగ్స్" నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డి.ఎమ్.ఎమ్. శేషగిరి గురువారం తెలిపారు. ఈ శాప్ లీగ్స్‌లో భాగంగా మార్చి 8వ తేదీన జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టెన్నిస్ పోటీలు:

స్థలం: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం, రాజమహేంద్రవరం

విభాగాలు: 40 సంవత్సరాల పైబడిన పురుషులు (సింగిల్స్ ,డబుల్స్)

మహిళలు (సింగిల్స్, మిక్స్డ్ డబుల్స్)

బ్యాడ్మింటన్ పోటీలు:

స్థలం: బొప్పన స్పోర్ట్స్ క్లబ్, హుకుంపేట, ఆదిత్యనగర్, రాజమహేంద్రవరం రూరల్

35 సంవత్సరాల పైబడిన పురుషులు (సింగిల్స్ డబుల్స్) మహిళలు (సింగిల్స్ ,మిక్స్డ్ డబుల్స్)


45 సంవత్సరాల పైబడిన పురుషులు (సింగిల్స్ , డబుల్స్)జిల్లా స్థాయిలో ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు మార్చి 14 , 15 తేదీలలో డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. టెన్నిస్‌లో ఎంపికైన క్రీడాకారులు మార్చి 22 , 23 తేదీలలో విజయనగరం జిల్లా లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలియ చేశారు.

ఈ పోటీలలో పాల్గొన దలచిన క్రీడాకారులు తప్పనిసరిగా శాప్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన క్రీడాకారులు మాత్రమే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనుటకు అర్హులన్నారు.

మరిన్ని వివరాలకు యోగా శిక్షకులు బి.వి.జి. నాగేంద్రన్ 9032934038ను సంప్రదించాలని డి ఎమ్.ఎమ్. శేషగిరి తెలిపారు.

# ఉమ్మడి జిల్లాలో 7, 8 తేదీల్లో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా పర్యటన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి 5 :**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మార్చి 7, 8 తేదీల్లో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా పర్యటిస్తారు.

జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మార్చి 6 వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రానున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం తెలిపారు.

కమిషన్ చైర్మన్ షెడ్యూల్ ప్రకారం, మక్వానా 6 శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ఓఎన్‌జీసీ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారన్నారు. మార్చి 7 వ శనివారం ఉదయం 11:00 గంటలకు తూర్పు గోదావరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక అభివృద్ధి, రక్షణాత్మక చర్యలపై కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ధవళేశ్వరం వర్క్‌షాప్‌లో, ఓఎన్‌జీసీ ప్రాంగణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం, ఓ ఎన్ జి సి అధికారుల సమావేశంలో పాల్గొంటారు. తదుపరి దిండి (రాజోలు) ప్రాంతంలోని సామాజిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అక్కడే రాత్రి విశ్రాంతి తీసుకుంటారు. 8 ఆదివారం ఉదయం 11:00 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నారు. అనంతరం ఆక్కడ నుంచి బయలుదేరి విజయవాడ విమానాశ్రయం చేరుకుని ఎయిర్ ఇండియా విమానంలో న్యూ ఢిల్లీకి వెళతారు.

జిల్లా స్థాయి అధికారులతో శనివారం జరిగే సమీక్షా సమావేశంలో అధికా రులు సంబంధిత నివేదికలతో హజరు కావాలని, జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, పథకాలు, రక్షణాత్మక చర్యల అమలుపై సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.కె. జియాఉద్దీన్ తెలిపారు.

# సెలూన్ షాపుల కేటాయింపు జీవో అమలు చేయాలి

## మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్ కి యానాపు. విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 5:** సెలూన్ షాపులకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 13ను మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేయాలని రాష్ట్ర నాయీబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు కోరారు. ఈమేరకు ఇంచార్జి కమిషనర్, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావుకి గురువారం వినతి పత్రం సమర్పించారు. చేతివృత్తిదారులైన నాయీబ్రాహ్మణులకు జీవనోపాధి కల్పించుటకు షాపుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారని ఆయన తెలిపారు. సంప్రదాయ వృత్తిని ఆధారంగా చేసుకుని నాయీ బ్రాహ్మణులు జీవనం సాగిస్తున్నారని, నగరంలో అనేక నిరుపేద కుటుంబాలు స్థిరమైన ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యానాపు ఏసు తెలిపారు.

నగర పరిధిలో నూతనంగా నిర్మించిన షాపులు గాని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న షాపులు గాని ఉంటె, జి.ఓ. ఎం.ఎస్. నెం.13 నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేద నాయీబ్రాహ్మణులకు సెలూన్ షాపుల కోసం కేటాయించాలని ఆయన కోరారు.

# నన్నయ ఖోఖో పోటీలకు విశేష స్పందన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5 :**ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో ఉమెన్ ఇంటర్ కాలేజియేటర్ కం ఛాంపియన్షిప్ అండ్ యూనివర్సిటీ టీం సెలక్షన్స్ కు విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి గోదావరి జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాల నుండి 16 జట్లు, 240 మంది పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసి కర్ణాటకలోని దేవాంగరే యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి స్వామి హాజరై సౌత్ జోన్ పోటీలుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఖోఖో క్రీడా ద్వారా చక్కని శారీరక వ్యాయామం, ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా ఎంత ఉత్సాహంతో మహిళా క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ చైర్మన్ గా ప్రిన్సిపాల్ డా పి విజయనిర్మల ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.ఎం.వి.వి.ఎం.యు. ఫణీంద్ర, అబ్జర్వర్ మేజర్ డా. ప్రమీలారాణి, సెలక్షన్స్ కమిటీ మెంబర్స్ ధర్మేంద్ర, పట్టాభి వ్యవహరించారు.

# కల్తీ పాల ఘటన లో మరొక మహిళ మృతి

**ఈ ఘటనలో 10 కి చేరిన మృతులు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5 :**నగరంలో జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జి వెంకటలక్ష్మి( 69) అనే మహిళ మరణించినట్లు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కె వెంకటేశ్వర రావు తెలియజేశారు. మృతురాలి ని కుటుంబ సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం మొత్తం 11మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితి నిరంతరం పర్యవేక్షణలో ఉండగా, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగు తున్నాయన్నారు. ఈ ఘటంలో ఇంతవరకు పదిమంది మృతి చెందారు. ఆసుపత్రుల వారీగా వివరాలు ప్రకారం కిమ్స్ హాస్పటల్లో 4 మంది, డెల్టా హాస్పిటల్ లో 3 మంది, రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్ 3 మంది, రవి చైతన్య హాస్పిటల్ 1 వ్యక్తి చికిత్స పొందుతున్నారన్నారు. రోగులకు సంబంధిత నిపుణుల వైద్యుల పర్యవేక్షణలో సముచిత వైద్య చికిత్స అందించ బడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె వెంకటేశ్వర రావు తెలిపారు.

# ఎమ్మెల్యే చిర్రి పై ప్రశంసలు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 5;** విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ "చలో విజయవాడ" కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పనితీరుపై రాష్ట్రస్థాయి జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రశంసలు కురిపించారు అని గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలిపారు. సభ వేదికపై రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన జర్నలిస్టుల సమక్షంలో ఎమ్మెల్యే చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు. ముఖ్యంగా జీలుగుమిల్లి ప్రాంతంలో విలేకరులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే చూపుతున్న చొరవను ప్రశంసిస్తూ, జర్నలిస్టుల సంక్షేమంపై ఆయనకు ఉన్న గౌరవం, కట్టుబాటు స్పష్టంగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తర్వాత జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాల పంపిణీ పనిని ముమ్మరం చేస్తున్న నాయకుడిగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును జర్నలిస్టు సంఘాల నాయకులు కొనియాడారు.

ఈ సందర్భంగా సభలో పాల్గొన్న జర్నలిస్టులు మరియు సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేపడుతున్న కార్యక్రమాలకు హర్షం వ్యక్తం చేశారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షల పోస్టర్ విడుదల

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 2 :**

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఏజెన్సీ జిల్లా విద్యాధికారి వై. మల్లేశ్వరరావు రంపచోడవరం లో విడుదల చేశారు.ఈ ప్రవేశ పరీక్షలు 5వ తరగతిలో 80 సీట్లకు, అలాగే 6వ, 7వ, 8వ తరగతులలో మిగిలిన సీట్లకు నిర్వహించబడతాయి. అదేవిధంగా ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం కూడా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 24, 2026న నిర్వహించబడనున్నాయి. ఇందులో రెసిడెన్షియల్ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.ఈ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 18 నుంచి మార్చి 31, 2026 వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. వివరాలు మరియు దరఖాస్తు ప్రక్రియను అధికారిక జాలగూడు చిరునామా ద్వారా తెలుసుకోవచ్చన్నారు.అలాగే ఈ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను అన్ని పాఠశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు.

# పల్స్ హాస్పిటల్లో తొలిసారిగా ట్రాన్స్ కేథటర్ ప్రక్రియ లో గుండె శస్త్రచికిత్స




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా ట్రాన్స్ కేథాటర్ అఓర్టిక్ రీప్లేస్ మెంట్ ( టి ఏ వి ఆర్) ప్రక్రియలో 76 సంవత్సరాల మహిళకు క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ చికిత్స లో మెడ్ ట్రానిక్స్ ఎఫ్. ఎక్స్ ట్రాన్స్ కేథాటర్ వాల్వ్ సిస్టమ్

ఉపయోగించడం ప్రత్యేకతగా కార్డియాలజిస్ట్ డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ తెలిపారు. స్థానిక పల్స్ హాస్పిటల్ లో గురువారం ఆయన మీడియా సమావేశంలో గుండె ఆపరేషన్ కి సంబంధించిన వివరాలను వెల్లడించారు. దివాన్ చెరువు చెందిన ఒక మహిళకు గుండె లోని అయార్టిక్ వాల్వ్ వంకర్ల తో ముడుసు కుపోవడంతో గుండెకు రక్తప్రసరణ నిలిచిపోయి అత్యంత క్లిష్టంగా మారిందన్నారు. సాధారణంగా ఓపెన్ హార్ట్ శస్త్ర చికిత్స చేసి స్టంట్ వేయాల్సి ఉండగా, పెద్ద వయసు, బీపీ, షుగరు లాంటి ఇతర సమస్యలు ఉండడంతో ఆధునిక పద్ధతిలో కాలి రక్తనాళం లో టి ఏ వి ఆర్ ప్రక్రియలో క్యాథటర్ సహాయంతో వాల్వును గుండెలో విజయవంతంగా అమర్చామని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. శస్త్ర చికిత్స బృందంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ రాజు కోసూరు డాక్టర్ సాజిత్ కిషన్, ఇతర వైద్య నిపుణులు ఇమేజింగ్ సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేసామన్నారు. రోగి 48 గంటల్లోనే డిశ్చార్జి అయిందని, ఈ విధానంలో తక్కువ నొప్పి, రక్త నష్టం, త్వరగా కోలుకోవడం ముఖ్యంగా వృద్ధులకు, అధిక ప్రమాదం ఉన్న రోగులకు ఉపయోగకరమన్నారు.

# రంపచోడవరం లో నల్లమిల్లి వేంకటరామారెడ్డి దంపతులకు సన్మానం



**రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 5 :**పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం పట్టణంలో గత 30 సంవత్సరాలుగా స్థానిక వ్యాపార సంస్థలో భాగస్వామిగా పనిచేస్తూ కుటుంబంతో సహా నివాసం ఉంటున్న నల్లమిల్లి వేంకటరామారెడ్డి, మంజు దంపతులకు గురువారం ఘనంగా సన్మానం నిర్వహించారు. స్థానిక జి.వి.కె. అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి) కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు మరియు స్థానిక హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గత పది సంవత్సరాలుగా రంపచోడవరం ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్తగా, విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ ప్రముఖ్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం గోవిందగిరి శ్రీవారి సేవక బృందం సమన్వయకర్తగా సేవలు అందించిన వేంకటరామారెడ్డి దంపతులను అభినందిస్తూ సన్మానించారు. వ్యక్తిగత కారణాల వల్ల తమ స్వగ్రామానికి సమీపంలోని కాకినాడ జిల్లా రాయవరం మండలం వి. సావారం గ్రామానికి తిరిగి వెళుతున్న సందర్భంగా ఈ సన్మానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి వి.హెచ్.పి రాష్ట్ర సభ్యులు భావన్నారాయణ ఆధ్వర్యం వహించగా, నారాయణగిరి ఆలయ అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు వేదాశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల సభ్యులు గుడ్ల అంకశ్రీనివాసరెడ్డి, ఎర్రా ఆనందరావు, బెజవాడ వేంకటేశ్వరరావు, వెలిశెట్టి వీరభద్ర ప్రసాద్, అన్నవరెడ్డి కృష్ణకిశోర్, లీలానాగు వీరభద్రగుప్త, పావని దంపతులు, కారంసత్యవేణి, జొన్నలగడ్డ బాలయ్య, హెచ్.ఎం. ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లమిల్లి వేంకటరామారెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 30 సంవత్సరాల పాటు భగవంతుని సేవలో ఉండటం తనకు గొప్ప అదృష్టమని అన్నారు. ఆదివాసీ సోదరులు చూపిన ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. హైందవ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను మరింతగా పెంపొందించాలని సహచరులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మీడియా సోదరులు అందించిన సహాయాన్ని మరువలేనిదిగా పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ం

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి

- యుటిఎఫ్ పిలుపు



**గంగవరం, పెన్ పవర్ మార్చి 5:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులను చైతన్యపరిచి, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల శాఖ పిలుపునిచ్చింది.స్థానిక ఎం.పి.పి. పాఠశాల గంగవరం లో యుటిఎఫ్ మండల శాఖ ఆఫీస్ బేరర్స్ సమావేశం మండల అధ్యక్షుడు కె. బొజ్జిదొర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన తల్లిదండ్రుల కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కె. బొజ్జిదొర, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని తెలిపారు. నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో ప్రభుత్వ బడులు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ప్రశ్నించే తరం, బాధ్యత గల పౌరులను తీర్చిదిద్దే కేంద్రాలుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సహాధ్యక్షురాలు రుక్మిణి దేవి, ఎఫ్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి కె. వెంకన్నదొర, మహిళా కార్యదర్శులు కె. భవాని, కుసుమ కుమారి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం :

- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయులు యువ నాయకులు బొలిశెట్టి రాజేష్.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్ మార్చ్ 05.** తాడేపల్లిగూడెం జనసేన పార్టీ 5వ విడత "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక 9వ వార్డు మసీద్ సెంటర్ రోడ్డు నందు వార్డు ఇంచార్జ్ వాకా నాని ఆధ్వర్యంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, క్రస్టల్ ఇంచార్జ్ గట్టిం నాని నేతృత్వంలో ఈ ప్రక్రియ జరుగుతుంది.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన

బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ ఉద్యమి పేరిట సామాజిక మార్పు కోసం సాగుతున్న ఈ కార్యక్రమంలో, జనసేన పార్టీలో భాగస్వామ్యం కావాలని, యువత మరియు సామాన్య ప్రజల ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.సాధారణ కార్యకర్తలకూ భవిష్యత్తులో నాయకత్వ అవకాశాలు, రాజకీయసామాజిక అంశాలపై శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. సభ్యత్వం ఉన్నవారికి పార్టీ కమిటీల్లో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తిగల వారు స్థానిక జనసేన సాధక్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశవభట్ల విజయ్,ముద్దాల మణికుమార్, నీలపాల దినేష్, బైనపాలెపు ముఖేష్, కాజులూరి మల్లేష్, వాకా నాగేశ్వరావు, యర్ర శ్రీను, లీల, పైబోయిన వైదేహి తదితరులు పాల్గొన్నారు.

# సీతపల్లి గడి బాపనమ్మ తల్లి జాతర పోస్టర్ విడుదల

**జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే శిరీషాదేవి రూ. లక్ష విరాళం**





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 5 :** రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలో వెలసిన మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాల పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జాతర ఆహ్వాన పత్రికను రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త విజయ్ భాస్కర్‌కు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ సంప్రదాయ పండుగలు దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా ఉంటాయని తెలిపారు. సీతపల్లి శ్రీ గడి బాపనమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18 వరకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ జాతరలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.శ్రీ గడి బాపనమ్మ అమ్మవారు అత్యంత పురాతనమైన, ప్రసిద్ధి చెందిన దేవతగా భక్తుల విశ్వాసాన్ని పొందినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలతో పాటు రెండు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, జాతర సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం తన వంతుగా రూ.1 లక్ష విరాళంగా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతరను పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆలయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కుంజం బాపన్నదొర, డైరెక్టర్ సత్యసుందర్‌రావు, భాను సప్లై కంపెనీ అధినేత బత్తిన శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు బత్తిన రామకోటేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి జి. సత్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నేడు విజయవాడ లో మానవ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం.

- 100 మంది ఉత్తమ సేవలందించిన మహిళలకు పౌరు సన్మానం.
- ఉమ్మడి తూ.గో.జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ చైర్మన్ బత్తిన రామకృష్ణ.






**గోకవరం పెన్ పవర్ మార్చి 05 :--** మానవ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జాతీయ అధ్యక్షులు బొడ్డపాటి దాస్ ఆదేశాల మేరకు ఎన్ టి ఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఆర్. కన్వెర్జెన్సీ మీటింగ్ హాల్, మార్వాడీ వీధి, బస్ స్టాండ్ దగ్గర జరుగుచున్నాయని ఈ మహిళా దినోత్సవానికి ఎన్నారై అమెరికాకు చెందిన వ్యక్తి ఆనం గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ చైర్మన్ బత్తిన రామకృష్ణ తెలిపారు. గోకవరంనుండి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఈ కార్యక్రమానికి బయలుదేరుతూ మీడియాకు ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మా మానవ హక్కుల ఫౌండేషన్ ద్వారా మార్చి 06 అనగా నేడు శుక్రవారం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మహిళా దినోత్సవానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి అనేకమంది వివిధ రంగాలలో ప్రతిభ చూపిన మహిళా మణులకు ప్రత్యేక పౌర సత్కార కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల చైర్మన్ బత్తిన రామకృష్ణ తెలిపారు. కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపాలెం కు ఇప్పటికే నలుమూలల నుండి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అనేకమంది సేవ రంగాలకు చెందిన మహిళామూర్తులు చేరుకున్నారని వారి అందరికీ కూడా మా మానవ హక్కుల ఫౌండేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోడపాటి దాసు, డాక్టర్ ఎనుముల రుక్మిణి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎనుముల రుక్మిణి,నేషనల్ జనరల్ సెక్రటరీ,డాక్టర్ కె. ఇందిర ప్రియదర్శిని,హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ సెక్రటరీ కల్లూరు నుండి జి అర్చన లతో పాటు ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో నలు మూలల నుండి వివిధ రంగాలలో నిష్ణేతులైన మహిళలు హాజరవుతున్నారని బత్తిన రామకృష్ణ తెలిపారు.

# కోరుకొండ ఎస్సైగా అంకారావు బాధ్యతలు..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చ్ 5:** కోరుకొండ ఎస్సైగా అంకారావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. బొమ్మూరు నుండి కోరుకొండ ఎస్సైగా అంకారావు వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

# పట్టాదార్ పాసు పుస్తకాలు జారీ ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. మార్చి 05.**రైతులకు పంపిణీ చేయవలసిన పట్టాదారు పాసు పుస్తకాలను ఎటువంటి తప్పులు లేకుండా సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా రైతులకు అందజేయాలి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.

గురువారం పెంటపాడు మండలం ఆకుతీగలపాడు గ్రామ పంచాయితీని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నెలలో రైతులకు పంపిణీ చేయవలసిన పట్టాదారు పాసు పుస్తకములలో ఉన్న వివరాలను స్వయంగా పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న భూమి వివరాలు, రీ సర్వే డేటా, ఆధార్ సీడింగ్, పంటల నమోదు, వారసత్వ మార్పులు వంటి అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వివరాల్లో ఎలాంటి తేడాలు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా పెండింగ్ లో ఉన్నవన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతుకు సమయానికి పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలని రెవెన్యూ సర్వే పంచాయతీ సిబ్బందిని సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు వచ్చినట్లయితే వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని అన్నారు. రైతుల భూ పరిరక్షణలో పట్టాదారు పాసు పుస్తకం కీలకమైన పత్రం కావడంతో నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులతో కూడా మాట్లాడి రైతులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భూ రికార్డులు సక్రమంగా ఉంటేనే రైతులకు రుణాలు, పంటల భీమా, సబ్సిడీలు సులభంగా లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంలో భీమవరం ఆర్డీవో మరియు తాడేపల్లిగూడెం ఇంచార్జ్ ఆర్డీవో కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహహసిల్దార్ సీతారత్నం, మండల సర్వే అధికారి దీప్తి లాస్య, విఆర్వో లవకుమార్, వీఆర్ఏ సాయిరాం, రైతులు, తదితరులు ఉన్నారు.

# రూ.1.56 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**పెన్ పవర్, ఉంగుటూరు మార్చి 05**

ఉంగుటూరు మండలం నారాయణపురంలో తారు రోడ్డు నిర్మాణ పనులను గురువారం గ్రామ సర్పంచ్ దిడ్ల అలకనంద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నారాయణపురం టూరింగ్‌పేట నుంచి టైల్స్ ఫ్యాక్టరీ రోడ్డువరకు గోపీనాథ్‌పట్నం దాకా సుమారు 3.2 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

ఈ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ నిధులతో పాటు మ్యాచింగ్ గ్రాంటుగా ఉపాధి హామీ పథకం నిధులు కలిపి మొత్తం రూ.1.56 కోట్లు మంజూరు చేయించగా, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జనవరి 13న శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో పనులు ప్రారంభించేందుకు సర్పంచ్ అలకనంద లాంఛనంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కిన నాగమణి, పంచాయతీ వార్డు సభ్యులు గంగాధర్, ఆశీర్వాదం, కూటమి నాయకులు సత్యనారాయణ, రాంబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, చిన్నారుల చట్టాలపై విస్తృత అవగాహన

- డీఎల్ఎస్ఏ ఐసీడీఎస్ సంయుక్త ర్యాలీ
- డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5** :జాతీయ న్యాయ సహాయ అధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్ సూచనలతో మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ చట్టాలపై అవగాహన ను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి తెలిపారు.గురువారం స్థానిక పుష్కర్ ఘాట్ నుంచి దేవిచౌక్ వరకు ఐసీడీఎస్, డీఎల్ఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో మహిళలు ఉద్యోగ బాధ్యతలతో పాటు గృహ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సమాజంలో ఇంకా వివక్ష ధోరణులు, దాడులు కొనసాగడం శోచనీయమన్నారు. ఆడపిల్లలతో పాటు అబ్బాయిలకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఆ బాధ్యత తల్లిదండ్రులు సమాజం పంచుకోవాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రత కోసం అమల్లో ఉన్న చట్టాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు.




ఈ కార్యక్రమంలో డీఎస్పీ భవ్య కిషోర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది, పోలీసులు, మహిళలు, డీఎల్ఎస్ఏ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మీనవల్లూరు శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వడ్డి రఘురామ్.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 05.**పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం మీనవల్లూరు గ్రామంలో శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు హాజరయ్యారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో వారితో పాటు వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు మీనవల్లూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'పది' పరీక్షల్లో అప్రమత్తంగా వ్యవహరించండి...



**సీఎస్,డీవోల సమావేశంలో డీఈవో నాగేశ్వరరావు.**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:**ఈ నెల 16వ తేది నుంచి ప్రారంభం కానున్న పది పబ్లిక్ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరిం టెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మండలంలోని ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశపు హాలులో గురువారం జిల్లా వ్యాప్తంగా నియమించబడిన సీఎస్, డీవో, ఏడీవోల సమావేశం ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో సీఎస్, డీవో, ఏడీవోలనుద్దేశించి డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడా, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేని విధంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమిష్టి కృషితో సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారను. ఎక్కడా మాల్ ప్రాక్టీస్కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహించడం ద్వారా జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకుని రావాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం ఏసీ బి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జరిగే పది పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష పేపర్లు జిల్లా కేంద్రం నుంచి పోలీస్టేషన్లకు పంపిస్తామన్నారు. పరీక్ష పేపర్లు విద్యార్థులకు అందజేసే సమయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఒకటికి రెండు సార్లు సరిచూసువాలన్నారు. జిల్లాలో 108 పరీక్షా కేంద్రాల్లో 19,630 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. 219 మంది సీఎస్,డీవో,ఏడీవోలను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో డీవైఈవోలు జి.సూర్యప్రకాష్, పి.రామలక్ష్మణమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు, డీఈవో కార్యాలయ ఏఎస్వో డి.తాతారావు, ఎస్ఎస్సీ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ మాచిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వెదురు సంరక్షణ, వినియోగం, ఉత్పత్తులపై గ్రామసభ



**వై రామవరం పెన్ పవర్ మార్చి 5** : వెదురు సంరక్షణ వినియోగం ఉత్పత్తులపై మండలములో చామగడ్డ పంచాయతీ దబ్బ మామిడి గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఉత్తర్వుల మేరకు దబ్బ మామిడి గ్రామంలో గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించడం జరిగిందని తెలిపారు. వెదురును సంరక్షించడం, వినియోగించడం, వెదురు ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 5:** స్త్రీలు మరియు పురుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కిషోరి బాలలు, బాలికలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, స్కూల్ ఉపాధ్యాయులుకు అవగాహన కల్పించారు. సీడీపీఓ పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కాట్రావులపల్లి పిహెచ్సి డాక్టర్ అయేషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీ పి ఎన్ డి టి యాక్ట్ చట్టం యొక్క ప్రధాన లక్ష్యం ఆడ శిశువు హత్య నివారించడమన్నారు. సమాజంలొ పిల్లల లింగ సమతుల్యత కాపాడడం ప్రవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్లు, ఆల్ట్రాసౌండ్ సెంటర్ లు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయుంచాలన్నారు. గర్భిణీస్త్రీకి లింగం చెప్పడం లేదా అడగడం నేరమని డాక్టర్ లేదా స్కాన్ సెంటర్ చట్టాన్ని ఉల్లంగిస్తే లైసెన్స్ రద్దు అవుతుందని 3 సంవత్సరాలు జైలు శిక్ష, 10వేలు జరిమానా విధిస్తారన్నారు. బాలికలు నెలసరి సమయంలో శుభ్రమైన ప్యాడ్స్ ఉపయోగించాలన్నారు. పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు వంటి పోషకహారం తీసుకోవాలని రక్త హీనత రాకుండా ఐరన్ ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం సూపరవైజర్ సునీత, తల్లులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వాల నమోదులో నియోజకవర్గం ను ప్రథమ స్థానంలో నిలపాలి. సువర్ణ రాజు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 5.** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ కు శ్రీకారం చుట్టినట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు ప్రకటించారు. నల్లజర్ల మండలంలోని చోడవరం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చోడసాని బాపిరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సువర్ణ రాజు ముందుగా శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ప్రచార వాహనాన్నిజండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలు వేడుకగా జరగాలన్నారు. పార్టీ సాధకులు ఈ కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషించవలసి ఉందన్నారు. గ్రామ గ్రామాన పర్యటిస్తూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన ప్రయోజనాల గురించి తెలియజేయాలన్నారు. అలాగే పార్టీ ఇచ్చే భరోసాలను ప్రజలకు వివరించి అత్యధిక సభ్యత్వాలు నమోదు అయ్యేలా చూడాలన్నారు. పార్టీ సభ్యత్వం చేయించుకునే వారికి ఏమైనా ప్రమాదాలకు సంభవిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఇన్సూరెన్స్ ఉంటుందని వివరించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి పాలనలో అభివృద్ధిలోఎన్నో అద్భుతాలను చేసి చూపించారన్నారు. అటువంటి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేయాలన్నారు. సభ్యత్వాల నమోదులో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థాయిలో నిలపాలని కోరారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు బాపిరాజు మాట్లాడుతూ ఈ ప్రచార వాహనం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. పార్టీ సాధకులు కార్యక్రమంలో ప్రధాన భూమిక పోషిస్తూ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసైనికులు, వీర మహిళలు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ డైరెక్టర్ గుడిసె శివకృష్ణ, మండల పార్టీ కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, గుండా బత్తుల వరుణ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల వివేక్, మండల పార్టీ ఉపాధ్యక్షులు పెనుమాక కిషోర్, చోడ సాని వెంకటేశ్వరరావు, తలంశెట్టి శ్రీనివాస్, దాసరి సోమేశ్వరరావు, ఎం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల పనులు వేగవంతం చేయాలి

కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 5** :గృహ నిర్మాణాలపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ఇళ్ల నిర్మాణాల పనుల్లో జోరు పెంచాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు గృహ నిర్మాణంపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగుబంద, కానవరం, నిడిగట్ల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. అధికారులు, గుత్తేదార్లు సమన్వయంతో వ్యవహరించి లేఅవుట్లలో చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని తప్పనిసరిగా స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలని స్పష్టం చేశారు. సొంత స్థలంలో కట్టుకునే వారితోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారిని చైతన్యపరచాలని సచివాలయ ఎమినిటీ సెక్రటరీలకు సూచించారు. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునేందుకు చొరవ చూపాలన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకపోతే, దానికి సహేతుకమైన కారణాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఉగాది నాటికి ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (హౌసింగ్) బుజ్జి, ఎమినిటీ సెక్రటరీలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఏడు రంగుల జీవితపాఠమే హోళి



**టీ నర్సాపురం, పెన్ పవర్, మార్చి 5:**మూడు రోజుల పాటు నామవరం గ్రామంలో జరిగిన హోళి పండుగ వేడుకల్లో చివరి రోజు బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు హోళి కానుకగా చీరలను అందజేశారు. బంజారా భజరంగీ భేరి సంఘ అధ్యక్షులు మూడు శ్రీనివాస రావు నాయక్ మాట్లాడుతూ హోళి పండుగతో బంజారాల నూతన సంవత్సరం మొదలవుతుందని, ఏడు రంగులతో జీవితాన్ని ఇంద్ర ధనుస్సులా మార్చుకోవాలని నేర్పే జీవిత పాఠమే హోళి పండుగ అని అన్నారు. సంఘ ప్రధానకార్యదర్శి బాణావతు కృష్ణ నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లోని చెడు శక్తులను హోళి మంటల్లో దహనం చేసి, నూతన వెలుగులను జ్వలింపజేయడమే హోళి పండుగఅర్థంఅనిఅన్నారు.

భూక్యా వేణు గోపాల్ నాయక్, భూక్యా రవి, ఇస్లావతు ప్రేమ్ చంద్ గ్రామ పెద్దల చేతుల మీదుగా మహిళలకు చీరలు పంచిపెట్టారు.మహిళలు రంగులు పులుముకుని బంజారా ఆటపాటలతో, నృత్యాలతో ఆనందంగా హోళి పండుగను జరుపుకున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# వైసీపీలో కొత్త నియామకాలు



**కడప, మార్చి 5,పెన్ పవర్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. జగన్మోహన్ రెడ్డి సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నేతలు మోహరి స్తున్నారు. గత కొద్దిరోజులుగా కాపు సామాజిక వర్గం చుట్టూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు తిరుగుతున్నాయి. మరోవైపు ఎస్సీ సామాజిక వర్గం నేతలతో కూడా జగన్మోహన్ రెడ్డి గట్టిగానే మాట్లాడిస్తున్నారు. ఒకవైపు రాజకీయం చేస్తూనే మరోవైపు రాజకీయంగా బలపడాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రాంతాలవారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా పార్టీలో సీనియర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. తాజాగా రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు.
గతంలో ఉత్తరాంధ్రను ఒక రీజియన్ గా చూసి నియామకాలు చేపట్టేవారు. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు కలిపి ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించిన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి లాంటివారు వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి ఉత్తరాంధ్రను విడగొట్టారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ఒక రీజియన్ గా చూపి కోఆర్డినేటర్ గా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును నియమించారు. మరోవైపు విశాఖ, విజయనగరం రీజియన్ కోఆర్డినేటర్ గా మాజీమంత్రి కురసాల కన్నబాబును, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఒక రీజియన్ గా చేసి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను, ఉమ్మడి పశ్చిమగోదావరి రీజియన్కు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ను సమన్వయకర్తగా నియమించారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా కీలక నేతలందరికీ బాధ్యతలు అప్పగించినట్టు అవుతుంది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రీజియన్లను విభజించి కోఆర్డినేటర్లను నియమించేవారు. ఈ నేపథ్యంలో రకరకాల సమస్యలు వచ్చేవి. ఈసారి అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ.. అందరి నేతలకు బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా కోఆర్డినేటర్లను నియమిస్తారని తెలుస్తోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. అంతకంటే ముందే రీజనల్ కోఆర్డినేటర్ల నియామకం పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన అదే పని మీద ఉన్నారు. మరోవైపు రాష్ట్ర కోఆర్డినేటర్ గా ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన స్థానంలో సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు నియమిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే మున్ముందు పార్టీ నియామకాల విషయంలో జగన్మోహన్ రెడ్డి కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తారని ప్రచారం నడుస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రంగుల మిరపతో పాటు.. మహేంద్ర...
# వైరల్ గా మారిన లోకేష్ ట్వీట్

**గుంటూరు మార్చి5, పెన్ పవర్ :** గుంటూరు మిర్చి సాగు అద్భుత దృశ్యాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన ఆసక్తికర చర్చ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గుంటూరు జిల్లాలో మిరపకాయలను ఆరబోసిన దృశ్యాలను డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోను ఆనంద్ మహీంద్రా షేర్ చేశారు. పైనుంచి చూస్తుంటే ఎర్రటి తివాచీ పరిచినట్లున్న ఈ దృశ్యం ప్రకృతి సిద్ధమైన హోలీ రంగుల పండుగను తలపిస్తోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని కేవలం వ్యవసాయానికే పరిమితం చేయకుండా, ఏపీ ప్రభుత్వం దీనిని ఒక పర్యాటక ఆకర్షణగా మార్చాలని ఆనంద్ మహీంద్రా సూచించారు. శీతాకాలంలో జరిగే ఈ పంట కోత సమయాన్ని పర్యాటక సీజన్‌గా మార్చవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. నేల మీద నుంచి చూస్తే ఈ అందం కనిపించకపోవచ్చని, అందుకే పర్యాటకుల కోసం హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అలాగే స్థానిక సంగీత, నృత్య ప్రదర్శనలతో ఒక ఫెస్టివల్‌లా దీనిని నిర్వహించవచ్చని అద్భుతమైన ఐడియాలను ఇచ్చారు.ఆనంద్ మహీంద్రా సూచనలపై మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తూ సానుకూలంగా సమాధానమిచ్చారు. గుంటూరు మిర్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, వేల మంది రైతుల కష్టానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ రంగుల దృశ్యాన్ని పర్యాటక పరంగా ఎలా అభివృద్ధి చేయవచ్చో పరిశీలించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు లోకేష్ విజ్ఞప్తి చేశారు. మహీంద్రా ఇచ్చిన సలహాలు స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో మంత్రి లోకేష్ చమత్కారంగా మరో ప్రతిపాదన కూడా చేశారు. భవిష్యత్తులో ఏపీపై డ్రోన్ విజువల్స్ తీసినప్పుడు కేవలం వ్యవసాయ క్షేత్రాలే కాకుండా.. రాష్ట్రంలో రాబోయే మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఏరోస్పేస్ పార్కులు కూడా ఆ డ్రోన్ కెమెరాల్లో కనిపించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా కూడా ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రపంచానికి చూపించాలనే తన ఆకాంక్షను ఆయన వెల్లడించారు. ఆనంద్ మహీంద్రాను స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తూ లోకేష్ ట్వీట్ చేశారు. ఏపీలో ఉన్న పారిశ్రామిక మరియు పర్యాటక అవకాశాలను దగ్గరుండి చూపిస్తామని లోకేష్ పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.నారా లోకేష్ ఈ వీడియో పోస్ట్ చేసిన తర్వాత దీనిపై దేశీయ కార్పొరేట్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా స్పందించారు. వీడియో అద్భుతంగా ఉందని.. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉందని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. దీనిపై కందుల దుర్గేష్ తో మాట్లాడుతామని.. పర్యటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని నారా లోకేష్ పేర్కొన్నారు. అయితే ఇక్కడే నారా లోకేష్ తన లౌక్యాన్ని ప్రదర్శించారు. భవిష్యత్తు కాలంలో ఏపీలో మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను కూడా ఇలాంటి డ్రోన్ కెమెరాల ద్వారా రూపొందించిన వీడియోలో చూడాలని ఉందని లోకేష్ పేర్కొన్నారు. లోకేష్ అకస్మాత్తుగా తనలో ఉన్న ఈ మాటను బయట పెట్టడంతో ఆనంద్ మహీంద్రా కూడా సానుకూలంగా స్పందించారు.భవిష్యత్ కాలంలో ఏపీలో మహీంద్రా కంపెనీ ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటి ద్వారా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సమాచారం. మహేంద్ర కంపెనీ ఇప్పటికే విశాఖపట్నంలో ఐటీ కార్యకలాపాలు సాగిస్తోంది. సత్యం కంపెనీని టేకోవర్ చేసుకున్న తర్వాత మహీంద్రా ఐటీ కార్యకలాపాలను వేగవంతం చేసింది. హైదరాబాదులో టెక్ మహీంద్రా పేరుతో అతిపెద్ద ఐటీ కంపెనీని నిర్వహిస్తోంది. ఒక పారిశ్రామిక దిగ్గజం ఇచ్చిన ఐడియాకు, ఒక యువ మంత్రి స్పందించిన తీరు సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

# ఏపీ బియ్యం తెలంగాణకు..




**ఏలూరు, మార్చి 4, పెన్ పవర్ :** ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిత్యం ఏదో ఒక చోట రేషన్ బియ్యం పట్టుపడుతూనే ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో విధాలుగా కట్టడి చేసే ప్రయత్నం చేసింది. కానీ అడ్డుకట్ట పడడమే లేదు. ముఖ్యంగా కాకినాడ పోర్టు ద్వారా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిపోతుందన్న ఆరోపణలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందుకు తగ్గట్టుగానే భారీ షిప్ పై తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటినుంచి కాకినాడ పోర్ట్ పై ప్రత్యేక నిఘా ఉంది. అయితే ఆ పోర్టుపై రేషన్ బియ్యం తరలింపు ఆగిన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రవాణా కొనసాగుతూనే ఉంది.రేషన్ బియ్యం విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతూ వచ్చింది. తనిఖీలను ముమ్మరం చేసింది. అయినా సరే కట్టడి జరగడం లేదు. కొంతమంది మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోంది. గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించుకొని.. ప్రజలు రేషన్ బియ్యం విడిపించిన వెంటనే ఆ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని కమీషన్ ప్రాతిపదికన మిల్లర్లకు విక్రయిస్తున్నారు. అదే బియ్యం రీ పాలిష్ చేసి లెవీకి పంపుతున్నారు. అదే బియ్యాన్ని మళ్లీ రేషన్ బియ్యం గా మార్చేస్తున్నారు. ఈ దందా కొనసాగుతూనే ఉంది. అయితే తెలంగాణ బియ్యం ఏపీకి.. ఏపీ బియ్యం తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా తెలంగాణ నుంచి ఏపీకి తరలిస్తున్న బియ్యం నల్గొండ జిల్లాలో పట్టుబడింది.ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు అక్రమార్కులు. కానీ ఇప్పుడు తెలంగాణ నుంచి ఏపీకి బియ్యం తీసుకొచ్చి చలామణి చేస్తున్నారు. సన్న బియ్యం పేరిట విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారులు రేషన్ విడిపించిన వెంటనే వారి నుంచి 15 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసినందుకు గాను మధ్య వ్యక్తులకు మిల్లర్లు, వ్యాపారులు కిలో దగ్గర నాలుగు రూపాయలు అందిస్తున్నారు. అదే బియ్యాన్ని ఏపీలో 25 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంటే కిలో దగ్గర పది రూపాయలు దోపిడీ కొనసాగుతోందన్నమాట. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడడంతో అసలు విషయం బయటకు వచ్చింది. గత కొద్దిరోజులుగా ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎక్కడికక్కడే తనిఖీల ద్వారా ఈ రేషన్ బియ్యం రవాణా కు చెక్ పెట్టేందుకు రెండు రాష్ట్రాల అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. విస్తృత తనిఖీలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే బియ్యం రవాణా కట్టడికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగడం విశేషం.

# ఆల్ ఈజ్ వెల్ కోసం తాపత్రయం

**గుంటూరు, మార్చి 5 )పెన్ పవర్ :**
ఒకటే ఎజెండా. ఒకటే లైన్. నో క్లాషెన్. కమ్యూనికేషన్ గ్యాప్స్‌కు ఛాన్సే లేదు. డెసిషన్ ఏదైనా..మ్యాటర్ మరేదైనా కలిసే నిర్ణయం తీసుకుంటాం. కలిసిగట్టుగానే ముందుకెళ్తామంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. కూటమి భాగస్వామ్య పార్టీల రథసారథులుగా కీలకంగా ఉన్న ఇద్దరు టాప్ లీడర్లు..వరుస పెట్టి..నెలలో ఒకటి రెండుసార్లు భేటీ అవుతుండటం సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆ ఇద్దరు వన్ టు వన్ భేటీ అయ్యారు. కూటమిలో రెండు కీలక పార్టీల అధ్యక్షులు. పైగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశంపై ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ చర్చ జరుగుతోంది. వరుస పెట్టి భేటీల వెనుక మ్యాటరేంటన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఈ మధ్య రెగ్యులర్‌గా భేటీ అవుతూ పొలిటికల్ హాట్ టాపిక్ అవుతున్నారు. అటు అసెంబ్లీ సమావేశాల్లో కలుసుకుంటున్నారు. మంత్రివర్గ సమావేశాల్లోనే పక్కపక్కనే కూర్చుంటారు. అయినా ఆ ఇద్దరు ప్రత్యేకంగా భేటీ అవుతుండటం కూటమి నేతల్లో, జనాల్లో తెలియని క్యూరియాసిటీని పెంచేస్తోంది.బాబు, పవన్ ఇద్దరూ రోజంతా అసెంబ్లీలో కనిపిస్తున్నారు. అటు మంత్రివర్గ భేటీలో కూడా కలిసే ఉంటారు. నెక్స్ట్ డే స్పెషల్‌గా వన్ టు వన్ భేటీ అవుతున్నారు. అలా వన్ టు వన్ భేటీ జరిగిందంటే ఏదో కీలక అంశాలపై డిస్కస్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ మధ్యలో జరిగిన రాజకీయ పరిణామాల మీదనే ఈ ఇద్దరు చర్చించి ఉంటారని అంటున్నారు.ఈ మధ్యే బాబు, పవన్ భేటీ జరిగింది. కల్తీ నెయ్యి ఇష్యూతో పాటు..పలు అంశాలపై డిస్కస్ చేశారు. ఆ తర్వాత కూటమి పార్టీల కంబైన్డ్ ప్రెస్‌మీట్ పెట్టి సంకేతాలు ఇవ్వగలిగారు. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి బాబు, పవన్ సమావేశం జరిగింది. అది కూడా ఓవైపు అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండగా బాబు, పవన్ సమావేశానికి ముందు ఏదో ఒక ఇష్యూ జరుగుతూనే ఉంది. ఆ టాపిక్ మీదే వారి భేటీలో డిస్కషన్ జరిగినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ మధ్య ఒంగోలు కూటమి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జనసేన నేత, మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మధ్య కోల్డ్‌వార్ మరోసారి రచ్చకెక్కింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో తగ్గేదేలే అంటున్నారు ఆ ఇద్దరు లీడర్లు. సేమ్‌టైమ్ అక్కడక్కడ జనసేన, టీడీపీ యాక్టివిస్టుల మధ్య ఇన్‌సైడ్ వార్ కొనసాగుతోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ మధ్య మంచి అండర్ స్టాండింగ్ ఉన్నా..గ్రౌండ్ లెవెల్‌లో ఎక్కడో ఓ చోట క్లాషెస్ రచ్చకెక్కుతుండటం కూటమికి హెడెక్‌గా మారాయి. ఈ ఇంటర్నల్ వార్‌కు ఎప్పటికప్పుడు చెక్ పెట్టేందుకు ప్రయత్నించే క్రమంలోనే చంద్రబాబు, పవన్ భేటీలో కీలక డెసిషన్ తీసుకున్నట్లు చెప్పుకుంటున్నారు.కూటమిలో రెండు పార్టీల క్యాడర్ నుంచి మొదలెట్టి లీడర్ల దాకా అంతా కలసికట్టుగా ఉండాలని టీడీపీ, జనసేన చీఫ్‌లు ఎప్పటికప్పుడు కోరుతూనే ఉన్నారు. ఏ ఇబ్బందులు, సమస్యలు ఉన్నా కూర్చుని సర్దుబాటు చేసుకోవాలని చెబుతున్నారు. అలకలు, అసంతృప్తులు సహజం..వాటిని పెద్దవి చేయకుండా సాఫీగా పరిష్కారం చేసుకోవాలని కూడా సజెస్ట్ చేస్తున్నారు. అయినా కొంత గ్యాప్ అయితే అక్కడక్కడ కొనసాగుతోంది. వాటికి ఎలా చెక్ పెట్టాలనేది టాప్ ప్రయారిటీగా తీసుకోవాలని అనుకుంటున్నారు.ఇప్పటికే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోవడం..కూటమి పార్టీల మధ్య క్లాషెస్ వైసీపీకి అడ్వాంటేజ్‌గా మారే ప్రమాదం ఉండటంతో వీలైనంత త్వరగా అంతా సెట్‌రైట్ చేయాలని భావిస్తున్నారట. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన భేటీ ఏకంగా రెండు గంటలకు పైగా సాగింది. పాలనాపరమైన అంశాల నుంచి రాజకీయ అంశాల దాకా చర్చకు వచ్చాయని చెబుతున్నారు. ఏపీలో విపక్ష వైసీపీ వ్యవహార శైలి, మండలిలో ఛైర్మన్ తీరు..రాజ్యసభ సీట్లపై కూడా చర్చ జరిగిందని అంటున్నారు.ఏపీలో ఇంకా కొన్ని కీలక నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. తొందరలోనే నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. వీటిపై కూడా డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. టీడీపీకి రెండు, బీజేపీ, జనసేనకు చెరో రాజ్యసభ సీటు అన్నది ఐదారు నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఈ సీట్ల కోసం ఎంతో మంది ఆశావహులు ఉన్నారు. అయితే ఎవరిని నామినేట్ చేయాలన్నది చర్చించి ఉండే అవకాశం ఉంది. ఇక అసెంబ్లీ సెషన్ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. దాంతో ఈ సమావేశాలు ముగిసేలోపు చేపట్టాల్సిన
వ్యూహంపై చర్చించారని అంటున్నారుఅయితే లేటెస్ట్‌గా వైసీపీ కాస్త దూకుడు పెంచినట్లు కనిపిస్తోంది. కల్తీ నెయ్యి ఇష్యూలో సిట్ రిపోర్ట్ తర్వాత చాలా మంది లీడర్లు లైమ్ లైట్‌లోకి రావడం..కూటమిపై డైరెక్ట్ అటాక్ చేస్తుండటంతో..మరింత పటిష్టమైన వ్యూహంతో ముందుకెళ్లే ఆలోచన చేస్తోందట కూటమి. ప్రతీ అంశాన్ని రాజకీయంగా పీక్స్‌కు తీసుకెళ్తున్న ఫ్యాన్ పార్టీని ధీటుగా ఎదుర్కోవాలన్నదే చంద్రబాబు, పవన్ డెసిషన్ అంటున్నారు. అయితే చంద్రబాబు, పవన్ ఇద్దరు కీలక శాఖలు చూస్తున్నారు. అవన్నీ నిధులు ఉంటేనే పనిచేయగలిగే శాఖలుఅలాంటి ఇంటర్నల్ అంశాలే కీలకమైనా..ప్రతీసారి ఈ ఇద్దరి భేటీతో అయితే ఇటు కూటమి పార్టీల క్యాడర్‌కు, అటు ప్రజలకు పాజిటివ్ ఇండికేషన్సే వెళు తున్నాయని చెబుతున్నారు. వారి భేటీ కంటే ముందు జరుగుతున్న రాజకీయ రచ్చ, ప్రజా సమస్యలపై సీఎం, డిప్యూటీ సీఎం భేటీలో ఓ కన్‌క్లూజన్‌కు వస్తున్నారని అంటున్నారు. సేమ్‌టైమ్ కూటమి బలంగా పటిష్టంగా ఉందని మిత్రుల మధ్య సయోధ్య ఉందన్న సందేశం వెళ్తుందని చర్చించుకుంటున్నారు.

# టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్లలో ఏపీ టాప్

**విజయవాడ మార్చి 5, పెన్ పవర్ :**
అవయవాల దానశీలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్రాల వారీగా అవయవ దానశీ జాబితా–2025ను ప్రకటించింది. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు.ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు జీజీహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్–తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జీజీహెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు.అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, వైయస్సార్ కడప, తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు.. మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు.విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు



ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధీకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు మంత్రి సత్యకుమార్. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు.1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు మంత్రి. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..రాష్ట్రంలో 20–50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు మంత్రి సత్యకుమార్. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం ఉన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0–09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ
లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. అలాగే అవయవదాత కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ.లక్ష వరకు పెంచే విషయశీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# ఇంగ్లాండ్‌పై భారత్ గెలవడం కష్టం.. పాక్ మాజీ క్రికెటర్ బోల్డ్ ప్రెడిక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా, ఇప్పటికే సూపర్---8 దశలోనే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్ జట్టు.. ఆ దేశ మాజీ క్రికెటర్లు మాత్రం ఈ మ్యాచ్‌పై పిచ్చి కూతలు కూస్తున్నారు. మాజీ పాకిస్థాన్ కెప్టెన్ రషీద్ లతిఫ్ 'హార్నా మనా హై' అనే కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇంగ్లాండ్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నాడు. ఎందుకంటే, కఠినమైన పరిస్థితుల్లోనూ వారు బాగా ఆడుతున్నారు.. ఆ జట్టులో ఇద్దరు లేదా ముగ్గురు బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు.. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ చాలా బలంగా ఉందని కామెంట్స్ చేశాడు.

వాంఖెడే మైదానంలో పరిస్థితులు కూడా ఇంగ్లాండ్‌కు అనుకూలంగా ఉండొచ్చని రషీద్ లతిఫ్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లలో ఒక్కరు మంచి ప్రదర్శన చేసినా భారత్ ఓడిపోవడం పక్కా అని వ్యాఖ్యానించాడు. ఈ టోర్నీ ప్రారంభంలో ఇంగ్లాండ్ జట్టు ఆశించిన విధంగా ప్రదర్శన చేయలేక పోయింది.. అయినప్పటికీ క్రమంగా పుంజుకుని సెమీఫైనల్‌కు చేరుకుంది అన్నాడు. గ్రూప్ దశలో నేపాల్, ఇటలీపై కష్టపడి గెలవగా, వెస్టిండీస్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. సూపర్-8 దశలో మాత్రం శ్రీలంక, పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లపై అద్భుతంగా ఆడిన ఇంగ్లాండ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా ఈ మ్యాచ్‌పై నమ్మకం వ్యక్తం చేశాడు. క్లోజ్ మ్యాచ్‌లలో కూడా గెలవడం మాకు అలవాటు.. ఆటలో ఎప్పుడూ నిరాశ చెందొద్దు అని నేను నేర్చుకున్నాను.. మా ప్లేయర్స్ లో గెలవాలనే తపన ఉంది.. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఆడగల సామర్థ్యం మాకు ఉందని వెల్లడించాడు.

భారత్‌తో మ్యాచ్ ఆడాలని మా జట్టులో చాలా మంది ముందే కోరుకున్నారు.. ఇది చాలా పెద్ద మ్యాచ్.. ఇరు జట్లపై కూడా ఒత్తిడి ఉంటుంది.. ఇండియన్స్ కి వారి అభిమానుల నుంచి మద్దతు ఉంటుంది.. వాంఖడే స్టేడియం మొత్తం సూర్య సేనకు సపోర్టు చేస్తుంది.. అయినప్పటికీ మేము మా ఆటను ప్రదర్శించాలని ఆశిస్తున్నాం.. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్ ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారని బ్రూక్ పేర్కొన్నాడు.

# నేను ఇంటికి పోతా.. మమ్మల్ని పంపించండి: కోల్‌కతాలో చిక్కుకున్న డారెన్ సామీ ఆవేదన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం వల్ల మిడిల్ ఈస్ట్?లో విమాన రాకపోకలు స్తంభించిపోయాయి. టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వచ్చిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు మిడిల్ ఈస్ట్?లో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఐదు రోజులుగా కోల్?కతాలోనే చిక్కుకుపోయింది. ఈ క్రమంలో వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన సామీ.. తనకు ఇంటికి వెళ్లాలనుందని పేర్కొన్నాడు. అసలు ఏం జరుగుతుందో మాకు ఏదైనా అప్డేట్ ఇవ్వండి.. ఇవాళా, రేపా లేక ఇంకో వారమా ఎప్పుడూ వెళ్తామో చెప్పండని కోరాడు. ఇప్పటికే ఐదు రోజులు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, టీ20 వరల్డ్ కప్ నుంచి వెస్టిండీస్ నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇండియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓటమి పాలై ఇంటి దారి పట్టింది. కరేబియన్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ ఐదు రోజులుగా ఇక్కడే చిక్కుకుపోయారు.

మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ పరిస్థితుల వల్ల విమాన రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో వెస్టిండీస్ ప్లేయర్ తమ సొంత దేశం వెళ్లేందుకు వీలు లేకుండాపోయింది. ఇదిలా




ఉండగా.. వెస్టిండీస్ క్రికెటర్స్ ను సొంత దేశానికి తరలించేందుకు ఐసీసీ చర్యలు చేపట్టినట్లు జుర్రాచీఎతీఅఎఅఅటశీ నివేదించింది. కోల్‌కతా నుంచి లండన్ మీదుగా కరేబియన్ దీవులకు వెళ్లేలా చార్టర్డ్ ఫ్లైట్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో వెస్టిండీస్ క్రికెటర్స్ తమ స్వస్థలాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# అభిషేక్ శర్మ చెలరేగితే ఇండియాను ఆపే టోడే లేడు.. కానీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఈరోజు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఇప్పటికే ఫైనల్ కి వెళ్లిన న్యూజిలాండ్ జట్టుతో తలపడనుంది. మొదటి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. కాగా, రెండో సెమీఫైనల్‌లో భారత్ బలమైన ప్రదర్శన చేసి ఫైనల్ ఫైట్ కి అర్హత సాధించాలని చూస్తుంది. ఇందులో భాగంగా టీమిండియా ఓపెనర్లు తమ ప్రదర్శనను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. అయితే వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మాత్రం వెస్టిండీస్ తో జరిగిన మ్యాచ్ తో ఫామ్‌లోకి వచ్చాడు.

**ముంబై ఇండియన్స్ బ్రిగేడ్‌పై ఆశలు:**

భారత జట్టులో ఉన్న ముంబై ఇండియన్స్ ప్లేయర్స్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇషాన్ కిషన్ టోర్నమెంట్ ప్రారంభంలో అద్భుతంగా ఆడినా ఇటీవల ఫామ్ కోల్పోయినట్లు కనిపిస్తుంది. గతంలో ముంబై ఇండియన్స్ జట్టు తరపున ఐపీఎల్ లో అనేక మ్యాచ్ లు ఆడిన అనుభవం ఉండటంతో.. వాంఖెడేలో తిరిగి మంచి ఇన్నింగ్స్ ఆడాలని చూస్తున్నాడు. అలాగే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా వాంఖడేలో రాణించాలని అభిమానుల గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

**అభిషేక్ శర్మ ఫామ్:**

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ ప్రారంభానికి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ ఈ పొట్టి వరల్డ్ కప్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. సూపర్-8 దశలో జింబాబ్వేపై హాఫ్ సెంచరీ చేసినా తన అసలు దూకుడు ఇప్పటి వరకు ఇంకా కనిపించలేదు. ఈ సెమీఫైనల్‌లో పెద్ద ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. ఒకవేళా ఈ సెమీస్ లో అతడు గానీ చెలరేగితే ఏ ఇంగ్లాండ్ బౌలర్ కూడా అభిషేక్ ని ఔట్ చేసే సహాసం చేయరు అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు.

**శాంసన్ అద్భుత ఫామ్:**

ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు స్టార్ ఓపెనర్ సంజు శాంసన్ పూర్తి స్థాయిలో ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతున్నాడు. వెస్టిండీస్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో అతను అజేయంగా 97 పరుగులతో నాటౌట్ గా నిలిచి, భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దాదాపు 10 సంవత్సరాల తర్వాత అంతర్జాతీయ వేదికపై సంజు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన అని చెప్పాలి.

**ఇంగ్లాండ్ బౌలర్ల సవాల్:**

ఇంగ్లాండ్ బౌలర్లు టీమిండియా ఓపెనర్లకు కఠిన పరీక్ష పెట్టే అవకాశం కనిపిస్తుంది. సీనియర్ స్పీడ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ తన బౌన్సర్లతో సంజు శాంసన్‌ను ఇబ్బంది పెట్టే ఛాన్స్ ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ఆఫ్ స్పిన్‌తో విల్ జాక్స్ పవర్‌ప్లేలో మరింత ప్రభావం చూపించే అవకాశం ఉంది. అలాగే, మిడిల్ ఓవర్లలో ఇంగ్లాండ్ స్పిన్ దళం ఇండియన్ జట్టుకు పెద్ద సవాల్ గా మారనుంది. లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఇప్పటి వరకు ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 11 వికెట్లు పడగొట్టగా, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ లియామ్ డాసన్ 10 వికెట్లు తీసి అద్భుతమైన ఫామ్‌ని కనబరుస్తున్నాడు.

**వరుణ్ చక్రవర్తికి అగ్ని పరీక్ష:**

టీమిండియా మిస్టరీ స్పిన్ బౌలర్ వరుణ్ చక్రవర్తి ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు స్థిరంగా రాణించలేకపోయాడు. సెమీఫైనల్‌లోనైనా అతను మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు, జస్ ప్రీత్ బుమ్రా మాత్రమే భారత జట్టు తరపున ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నప్పటకీ, హార్ధిక్ పాండ్యా, అర్ష్ దీప్ సింగ్ వికెట్లు తీసుకుంటున్నప్పటికీ.. ధారళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు.

# సెట్ లో అయినా, ఇంట్లో అయినా.. గౌరవం ఇవ్వాల్సిందే!

టాలీవుడ్‌లో మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగా ఉన్నప్పటికీ, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తనదైన ముద్ర వేయాలని డైరెక్టర్ గా కొత్త అడుగు వేస్తున్నారు. ఆమె దర్శకత్వంలో రూపొందిన సరస్వతి సినిమా మార్చి 6న రిలీజ్ కావడానికి సిద్ధమవుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రాగా, ఈ చిత్ర ప్రమోషన్స్ లో వరూ యాక్టివ్ గా పాల్గొంటున్నారు.

**ఆ సినిమా నుంచి తప్పుకున్నా!**

అహం, ఆత్మగౌరవంలో తాను ఆత్మ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని, ఓ మలయాళ మూవీలో తనను తక్కువగా చూశారని ఆ సినిమా నుంచి తాను తప్పుకున్నట్టు ఆమె వెల్లడించారు. ఆ సినిమా హీరో, డైరెక్టర్ మంచి వాళ్లైనప్పటికీ, నిర్మాత తనతో వ్యవహరించిన తీరు

అనన్య నాగల్లా సొగసైన ఎంబ్రాయిడరీ చీరలో టైమ్‌లెస్ గ్రేస్‌ను ప్రసరిస్తుంది





నచ్చకపోవడంతో, హీరోకు కాల్ చేసి ఈ సినిమాను చేయడం లేదని చెప్పానని, అది అహంభావం కాదని, ఆత్మ గౌరవమని ఆమె తెలిపారు.

**అందరితో నిజాయితీగా ఉంటా!**

తాను అందరితో నిజాయితీగా ఉంటానని, తాను అందరినీ గౌరవిస్తానని, తనను కూడా అందరూ గౌరవించాలని కోరుకుంటానని, సెట్ లో అయినా, ఇంట్లో అయినా ఎక్కడైనా గౌరవం ఇవ్వాల్సిందేనని, లేదంటే అస్సలు సహించనని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల్ని తాను పెద్దగా పట్టించుకోనని చెప్తున్న ఆమె, సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్తను చూసి తాను తెగ నవ్వుకున్నానని తెలిపారు.

**అదే ఉంటే ఇక్కడెందుకు ఉంటా?**

తన పెళ్లికి రూ.800 కోట్లు ఖర్చైందని సోషల్ మీడియాలో వార్తలొచ్చాయని, అంత డబ్బే తన దగ్గరుంటే అసలు ఇక్కడ ఎందుకు ఉంటానని అడిగారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా గురించి కూడా ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా కాలక్షేపానికి పనికొస్తుందని, దానిపై ఎక్కువ టైమ్ వేస్ట్ చేయకుండా, క్రియేటివ్ గా ఆలోచిస్తే, అది కెరీర్ కు ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఫహద్ ఫాసిల్, ఆలియా భట్, మంజు వారియర్, దీపికా పదుకొణె ను తానెంతో అభిమానిస్తానని చెప్తున్న వరలక్ష్మి, నాంది మూవీలో ఆద్య క్యారెక్టర్ అంటే చాలా ఇష్టమని, అది యాక్టింగ్ పరంగా చాలా గొప్ప పాత్ర అని చెప్పుకొచ్చారు. సరస్వతి సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకుంటుందని, ఈ సినిమా తీసినందుకు తనకు గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

కలర్‌ఫుల్ పోస్ట్‌ను షేర్ చేసింది అనసూయ



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965